క్లుప్తంగా

కంటి వైద్య, రక్తదాన శిబిరాలు



టోలు ప్లాజావద్ద వైద్య శిబిరం

ఉంగుటూరు: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక టోలు ప్లాజా వద్ద ఉచిత కంటి వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వీటిని టోలు ప్లాజా మేనేజర్ ఇంతియాజ్, ప్రాజెక్టు మేనేజరు బాల సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఏబీఎఫ్ సంస్థ ప్రతినిధులు, అధ్యక్షుడు వెజ్జు ప్రసాదు, శశి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. 51 మంది రక్తదానం చేయగా, 130 మందికి పైగా నేత్ర పరీక్షలు చేశారు. ఈ శిబిరాలను విజయవంతంగా నిర్వహించిన టోలు ప్లాజా రూటు మేనేజరు గంట సురేష్‌కుమార్‌ను పలువు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, అత్యవసర మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. లక్ష్మీపురం, ఆగడాలలంక, చెట్టున్నపాడు, మల్లవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు గోపన్నపాలెంలో ఆధార్ నమోదు కేంద్రం

దెందులూరు: గోపన్నపాలెం సచివాలయంలో శుక్రవారం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ కె.శ్రీదేవి తెలిపారు. ప్రజలు ఆధార్ సేవలను వినియోగించుకోవాలన్నారు.

అప్పనవీడు విద్యార్థుల ప్రతిభ



విజేతలను సత్కరించిన ఉపాధ్యాయులు

పెదపాడు : సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల్లో బాల్యం నుంచి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు పుష్పావతి సూచించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మండపేట మదర్‌థెరిసా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలోని నిర్వహించిన డ్రాయింగ్, డాన్స్ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల అప్పనవీడు విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. డ్రాయింగ్ పోటీల్లో ఏడుగురు, డాన్స్ పోటీల్లో ఆరుగురు బంగారు పతకాలను సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయురాలు పుష్పవతి, చిత్రలేఖన ఉపాధ్యాయులు ఎన్ రజనీకాంత్ తదితరులు అభినందించారు.

ఆహ్వాన పత్రం విడుదల

భీమడోలు: 12 ఏళ్లకోసారి వచ్చే భీమడోలు గ్రామదేవతల జాతర మహోత్సవ ఆహ్వాన పత్రాన్ని గురువారం ఉంగుటూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు విడుదల చేశారు. వచ్చే నెల 7 నుంచి మార్చి 9 వరకు గ్రామంలోని గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ, పోతురాజుల ఆలయాల వద్ద జాతర జరుగుతుందని తెలిపారు. జాతర కమిటీ ప్రతినిధులు దత్తాడ శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ప్రత్తి మదన్, పెద్దలు గంధం భాస్కరరావు, చింతా రాము, టి.రామ్మూర్తి, ఈతకోట బాబి, ఈతకోట సత్యకృష్ణ, పి.నరసింహమూర్తి, రాజేష్, దుర్గాపల్లవి, నీలం అజయ్ పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

దెందులూరు: వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన ఇనుపనూరి జగదీష్‌బాబు పార్టీ బలోపేతానికి, దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్ అన్నారు. గురువారం ఆయన తన నివాసంలో జగదీష్ బాబును శాలువా పూలదండలు బొకే జ్ఞాపకతో సత్కరించారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతులకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 95027 23561, 90140 40780, 95330 79471లో సంప్రదించాలని పేర్కొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు కోరుతూ వినతి

ఏలూరు రూరల్ : ఏప్రిల్ నెలలో ఎన్నికల సంఘం చేపట్టిన జనరల్ ఎన్నికల డ్యూటీ నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని ఉపాధ్యాయ నాయకులు కోరారు. గురువారం ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నికల డ్యూటి సర్టిఫికెట్లు అందక పలువురు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

మూలనపడ్డ అగ్నిమాపక శకటం

- ప్రధాన నీటి ట్యాంకు శిథిలం
- భీమడోలు పరిసర ప్రాంత ప్రజల్లో ఆందోళన



మూలన పడిన భీమడోలు అగ్నిమాపక కేంద్రం శకటం



పాడైన వాటర్ ట్యాంకు మూతతో కుస్తీ పడుతున్న సిబ్బంది

భీమడోలు: భీమడోలులోని అగ్నిమాపక కేంద్రం శకటం మూలనపడింది. శకటంలో నీరు నిల్వ ఉండే ప్రధాన ట్యాంకు శిథిలమవ్వడంతో కొన్ని రోజులుగా సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 15 ఏళ్ల కితం కొనుగోలు చేసిన ఈ శకటం (అగ్నిమాపక వాహనం)కు తరచుగా మరమ్మతులు చేయిస్తూ నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం మరమ్మతులు చేయడానికి కూడా వీలులేని పరిస్థితిలో ట్యాంకు ఉండడంతో అధికారులు పక్కన పట్టేశారు. సమస్యను జిల్లా అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వేరే వాహనాన్ని కేటాయించకపోవడంతో ఆందోళన నెలకొంది.

తరచూ మరమ్మతులు

భీమడోలు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాలున్నాయి. ఈ మండలాల్లో ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే అక్కడకు కొన్ని నిమిషాల వ్యవధిలోనే శకటం చేరాల్సి ఉంది. శకటం కండిషన్‌లో ఉన్నా, 4500 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు శిథిలమైంది. ఎనిమిదేళ్ల కితం ఇక్కడ వాహనం శిథిలావస్థకు చేరడంతో వైజాగ్ నుంచి ఈ వాహనాన్ని భీమడోలుకు కేటాయించారు. దీనికి అప్పటి నుంచి తరచుగా వచ్చే రిపేర్లు చేసుకుంటూ అగ్నిమాపక ప్రమాదాలను నియంత్రిస్తున్నారు.



పాడైన ట్యాంకు వెనుక భాగం

కొన్ని రోజులుగా వాహన ట్యాంకుకు భారీ రంధ్రాలు పడడంతో వెల్డింగ్ చేయించినా ఫలితం లేదు. దీంతో చేసేది లేక వాహనాన్ని మూలనపెట్టారు. ఇటీవల భీమడోలు అగ్నిమాపక కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆ శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులకు కూడా శకటం దుస్థితిని ఇక్కడి అధికారులు వివరించారు.

సమస్య ఉన్నతాధికారుల దృష్టికి



భీమడోలులోని శకటం సేవలు నిలిచిపోయాయి. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఈ స్టేషన్‌కు వేరే వాహనాన్ని కేటాయించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఫైర్ కాల్స్ వస్తే ఉన్నతాధికారుల సూచనల మేరకు ఏలూరు, తాడేపల్లిగూడెం, తణుకు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలాలకు వెళ్లి, ప్రమాదాలను అరికడుతున్నారు. ప్రజలు ఆందోళన చెందవద్దు.

– జి.నాగరాజు, అధికారి, అగ్నిమాపక కేంద్రం, భీమడోలు

వచ్చేది వేసవి.. నిలిచిన సేవలు

భీమడోలు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని రాష్ట్రీయ, జాతీయ రహదారులు ఉండడం, సుమారు 50 కిలో మీటర్ల దూరంగా ఉన్న గ్రామాలకు ఈ శకటం సేవలందించాల్సి ఉంది. హైవేలపై కార్లు, లారీల్లో షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు, నాలుగు మండలాల్లో గృహ, వ్యాపార దుకాణాలు, పరిశ్రమల్లో, అపార్ట్‌మెంట్లలో ప్రతి ఏటా 90 వరకు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని అరికట్టేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారు. సుమారు రూ.కోటి విలువ గల ఆస్తులను కాపాడుతున్నారు. వచ్చేది వేసవి సీజన్ కావడం, అగ్నిమాపక కేంద్రంలోని శకటం సేవలు నిలిచిపోవడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతుంది.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సూరప్పగూడెం గ్రామసభలో మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాస్

భీమడోలు: గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాస్ అన్నారు. సూరప్పగూడెం గ్రామ పంచాయతీని దత్తత తీసుకున్న నేపథ్యంలో ఆయన గ్రామ సభ నిర్వహించారు. మంచినీరు, రోడ్ల వంటి సమస్యలపై దృష్టి సారించి త్వరతగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని శ్రీనివాస్ తెలిపారు. రైతుల భూసర్వే చేయించుకోవాలని, సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం గ్రామంలోని మహిళల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భీమడోలు సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

25న ఓటర్ల దినోత్సవం

ఉంగుటూరు: జాతీయ ఓటర్లు దినోత్సవాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో ఈనెల 25న నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సత్కరిస్తామని, వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

గర్భకోశ వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దు



గేదెకు వైద్య పరీక్ష చేస్తున్న రాములయ్య



పోలసానిపల్లిలో మందులు అందిస్తున్న సర్పంచ్ రహీమా, ఏడీ సాయి రమేష్

దెందులూరు : పశువుల గర్భకోశ వ్యాధులను నిర్లక్ష్యం చేయవద్దని పశువర్ధక శాఖ పోతునూరు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ రాములయ్య అన్నారు. గురువారం పోతునూరు, కొత్తూరు గ్రామాల్లో గొర్రెలకు, దూడలకు డివార్మింగ్ చేశారు. 400 పశువుల్లో గర్భకోశ వ్యాధులకు సంబంధించి ఇంజక్షన్లు ఇచ్చారు. 35 పశువులకు చూడి పరీక్షలు చేశారు. గ్రామ శివారు ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

భీమడోలు: పాడి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని భీమడోలు పశుసంవర్ధక శాఖ ఏడీ ఇక్కుర్తి సాయి రమేష్ అన్నారు. పోలసానిపల్లి గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ షేక్ రహీమ, సొసైటీ మాజీ అధ్యక్షుడు గన్ని గోపాలరావులు ప్రారంభించారు. సీజనల్‌లో పశువులకు వచ్చే వ్యాధుల నివారణకు టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పాడి పరిశ్రమాభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. గ్రామంలోని పశువులకు ఉచిత వైద్య పరీక్షలు చేశారు. రైతులకు మందులను ఉచితంగా అందించారు. అనంతరం గ్రామంలోని ఒకటో వార్డులో దోమల ప్రబలకుండా పరిసరాలను మలాథిన్ ద్రావణంతో పిచికారీ చేయించారు. గ్రామంలోని బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమాల్లో వైద్యురాలు రమ్యశ్రీ, గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, పెద్దలు మునగంటి రమేష్, మద్దు శ్రీను, బాలాజీ, గోవింద్, వెటర్నరీ అసిస్టెంట్ సాయి, పంచాయతీ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ఉంగుటూరు: మండలంలోని తల్లాపురం, రావులపర్రు గ్రామాల్లో గురువారం ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. తల్లాపురంలో 30, రావులపర్రులో 40 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. పశువైద్యాధికారులు అశోక్, శిరీషలు పాల్గొన్నారు. తల్లాపురంలో సర్పంచ్ పశుపులేటి నర్సింహరావు చేతులు మీదుగా మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు నేతాజీ స్ఫూర్తిదాయకం



గణపవరంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

గణపవరం: నేతాజీ స్ఫూర్తితో విద్యార్థులు చిన్నతనం నుంచే దేశభక్తిని కలిగి ఉండాలని రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్ రాజు అన్నారు. గురువారం నేతాజీ సుభాస్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా గణపవరం 11వ వార్డు పాఠశాల వద్ద నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ భారతదేశ స్వాతంత్ర్య సమరంలో చూపిన పోరాట పటిమ ఆదర్శనీయమని రాజు అన్నారు. సొంత మిలిటరీ సేనను ఏర్పాటు చేసుకుని బ్రిటిష్ వారిపై పోరాడిన యోధుడని గుర్తుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వీట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేవీ వర్మ, మానాప్రగడ ప్రకాశంపంతులు, హెచ్‌ఎం లక్ష్మీసుగుణ పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో..

నిడమర్రు: నేతాజీ సుభాష్ చంద్రబోస్ పోరాట పటిమ నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని హేండ్‌లూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు అన్నారు. గురువారం నిడమర్రు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన నేతాజీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇంటి ఉదయభాస్కర రావు తదితరులున్నారు.

ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు అవసరం



అపుస్మా నాయకులతో క్రీడాకారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి క్రీడల అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ అన్నారు. అపుస్మా ఏలూరు జోన్ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బుధవారం ప్రారంభమైన క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాక క్రీడల్లోనూ ప్రతిభాపాటవాలు ప్రదర్శించాలని సూచించారు. అపుస్మా ఏలూరు జోన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు సైతం క్రీడల్లో ఉజ్వల భవిత అందించాలనే లక్ష్యంతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఏలూరు జోన్ పరిధిలో దాదాపు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, విజేతలకు త్వరలోనే బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో నగరానికి చెందిన శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యధిక క్రీడాంశాల్లో, దాదాపు అన్ని విభాగాల్లో విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించారు. అపుస్మా ప్రతినిధులు కె.చంద్ర శేఖర్, కడియాల విజయలక్ష్మి, ఎస్ఆర్‌కే ప్రసాద్, కె.వినోద్, జి.రవిశంకర్, వై.రాజా ప్రతాప్, ఎం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపు

దెందులూరు: రాష్ట్రంలో లక్షలాది మంది విద్యావంతులు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, మండల ఉపాధ్యక్షులు తలారి రామకృష్ణ, బొర్రా మురళి అన్నారు. గురువారం దెందులూరులో వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువత సంగతి గాలికి వదిలేసి చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ మౌనంగా ఉండటం కూటమి ప్రభుత్వ స్వభావాన్ని తెలియజేసిందన్నారు. సూపర్ సిక్స్‌కు ఖజానాలో నిధులు లేవని అసెంబ్లీలో ప్రకటించిన చంద్రబాబు దావోస్ పర్యటనకు రూ.కోట్లు వెచ్చించి ప్రచారం చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ ఎప్పుడు ప్రకటిస్తారు ? నిరుద్యోగ భృతి ఎప్పుడు అమలు చేస్తారు? అని కూటమి నాయకులను ప్రశ్నించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంసైతం గాలికి వదిలేశారని వివరించారు. ప్రతి జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఏసుబాబు, రామకృష్ణ, మురళి డిమాండ్ చేశారు.

ఆలయాలపై పట్టు కోసం పాకులాట

- కాబోయే ట్రస్టీలు తామేనంటూ ప్రచారం
- ఆలయాల్లో కూటమి చోటా నేతల తిష్ట
- ఈఓలు, సిబ్బందిపై పెత్తనం



పత్తేబాదలో నాలుగు గుడుల సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గత ఎన్నికల్లో తమ కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో ఆయా పార్టీల చోటా నాయకుల ఆగడాలకు అడ్డే లేకపోతోంది. ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లోనూ పట్టు సాధించేందుకు పాకులాడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రులు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వారు అధికారులను ఆదేశించే స్థాయిలో రాజకీయాలు నెరుపుతున్నారు. తమ మాట వినని అధికారులపై ఎమ్మెల్యేలకు చాడీలు చెప్పి వారిని ఇబ్బంది పెట్టడానికి చూస్తున్నారు. ఇప్పుడు వారి దృష్టి ఆలయాలపై పడింది. భక్తులు ఎక్కువగా వచ్చే ఆలయాలపై పట్టు కోసం పాకులాడుతున్నారు.

పదవులకు భరోసా

ఆయా పార్టీల చోటా నేతలు మండల స్థాయిలో ఏదో ఒక నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఐతే పార్టీ అనుబంధ విభాగాల పదవులు, లేదంటే ఏఎంసీలు, ఆలయాల ట్రస్ట్ బోర్డుల్లోనైనా తమకు పదవి ఇవ్వాలని ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేకు చెప్పుకుని ఉన్నారు. వారిలో కొందరికి కోరిన పదవులకు భరోసా లభ్యమైనట్టు సమాచారం. ఆయా పదవులకు భరోసా వచ్చిన చోటా నాయకులు తాము కోరిన ఆలయాలపై వాలిపోతున్నారు. కాబోయే ట్రస్టీలు, ట్రస్ట్ బోర్డు చైర్మన్లు తామేనని చెప్పుకుంటూ ఆయా ఆలయాల్లో తిష్ట వేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే లేదా అధిక ఆదాయం వచ్చే ఆలయాలపై వారి దృష్టిపడింది. వారికి ఎటువంటి పదవీ లేకపోయినా ఆయా ఆలయాలపై తమ ఆధిపత్యం ప్రదర్శించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

ఆ ఆలయాలపైనే దృష్టి

ఇటీవల స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల నిర్వహణకు ముందు నుంచి ఒక టీడీపీ చోటా నాయకుడు మితిమీరిన జోక్యం చేసుకున్నాడని ఆ ఆలయానికి నిత్యం వచ్చే భక్తులు, స్వామివారి ఉత్సవాల్లో సేవలు అందించే బృందాల సభ్యులు చర్చించుకుంటున్నారు. దీంతో పాటు నగరంలో ప్రసిద్ధి చెందిన పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం, కనకదుర్గమ్మ ఆలయం, అగ్రహారంలోని భూ నీళా సమేత జనార్దన స్వామి, పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, కొత్తపేట నూకాలమ్మ, దక్షిణపు వీధి శ్రీమత్ మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి దేవస్థానం వంటి పలు ఆలయాలకు ఆదాయం ఎక్కువగా రావడం, వార్షిక ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించే ఆలయాలపైనా చోటా నాయకులు దృష్టి సారించారు.

చెప్పినట్టు వినాల్సిందే

ఆయా ఆలయాలకు తామే ట్రస్ట్ బోర్డు చైర్మన్లు అవుతామనే అతి విశ్వాసంతో వారు అక్కడి కార్యనిర్వహణాధికారులు, ఆలయ సిబ్బందిపై పెత్తనం చూపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అర్చకులపైనా వారు అజమాయిషీ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెబుతున్నారు. ఆలయంలో తాము చెప్పినట్టు వినకపోతే ఎమ్మెల్యేతో చెప్పి బదిలీ చేయించడమో, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడమో చేస్తామని హెచ్చరిస్తున్నారని వాపోతున్నారు.

ఆదాయం బట్టి వర్గీకరణ

దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలను వాటికి వచ్చే ఆదాయాన్ని బట్టి 6ఏ, 6బీ, 6సీలుగా విభజించారు. రూ.25 లక్షల నుంచి రూ.కోటి ఆదాయం వచ్చే ఆలయాలను 6ఏగా, రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల్లోపు ఆదాయం వచ్చే ఆలయాలను 6బీగా, రూ.50 వేల నుంచి రూ.5 లక్షల్లోపు ఆదాయం వచ్చే ఆలయాలను 6సీగా వర్గీకరించారు. రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం, మెయిన్ బజారులోని రంగ్రీజుల మఠం, కెనాల్ రోడ్డులోని గాంధీ ఆంధ్ర జాతీయ మహా విద్యాలయాలు 6ఏ సంస్థల జాబితాలో ఉన్నాయి. సుమారు 15 ఆలయాలు 6బీ జాబితాలో ఉన్నాయి. వీటిపై కూటమి చోటా నేతల కన్ను పడింది.

చోటా నేతల జోక్యంతో గందరగోళం

కొందరు కూటమి చోటా నాయకులు తాము ట్రస్టీలుగా పదవి ఆశించే ఆలయాల్లో చేరి ఇప్పటికే పూజా వ్యవహారాల్లోనూ, భక్తులకు కల్పించే సౌకర్యాల్లోనూ జోక్యం చేసుకుంటూ గందరగోళం సృష్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రసాదాల పంపిణీలోనూ జోక్యం చేసుకుని తాము చెప్పిన దుకాణాల్లోనే నిత్యావసర సరుకులు, పూజా సామగ్రి, పూలదండలు, పుష్పాలు కొనాలని ఒత్తిడి చేస్తున్నట్టు చెబుతున్నారు. దీంతో గతంలో కంటే అధికమొత్తంలో చెల్లింపులు చేయాల్సి వస్తోందని, సరుకుల్లో నాణ్యత కొరవడుతుందని సిబ్బంది వాపోతున్నారు. వీరికి పదవి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.

నోటిఫికేషన్ విడుదల కాలేదు

ఏలూరు నియోజకవర్గంలోని ఆలయాల ట్రస్ట్ బోర్డుల పదవీ కాలం గతంలోనే ముగిసింది. ప్రస్తుతం ట్రస్ట్ బోర్డుల నియామకానికి దేవదాయ శాఖ నుంచి నోటిఫికేషన్ విడుదల కాలేదు. నోటిఫికేషన్ విడుదలైతే ట్రస్టీల నియామక ప్రక్రియ ప్రారంభమౌతుంది.

– దేవదాయ శాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్

నిత్య సహాయ మాత ఉత్సవాలు ప్రారంభం

దెందులూరు: పోతునూరు ఆర్‌సీఎం చర్చిలో గురువారం నిత్య సహాయ మాత ఉత్సవాలు ఫాదర్ తంబి రుంజల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. సీఎస్ఐ చర్చి పాస్టర్ రాయిరాల ప్రకాష్ రావు, దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జి.అమ్మన్ రాజా, ఏలూరు అశోక్ నగర్ విచారణ కర్త ఫాదర్ ఇంజే పాల్ ఉత్సవాలను ప్రారంభించారు. తొలుత చర్చి ప్రాంగణంలో పతాకాన్ని ఎగురవేశారు. ఆలయంలో దివ్య పూజ బలి నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు, ఆర్‌సీఎం సంఘస్తులు, పెద్దలు, యువత, మరియదళ సభ్యులు, ఉపదేశీయులు, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

వారిని అక్షరాస్యులుగా చేయాలి

దెందులూరు: మండలంలో 270 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ కె.శ్రీదేవి అన్నారు. గురువారం వెలుగు ఏపీఎం పి.సురేష్ 27 మంది ఉల్లాస్ ట్రైనర్స్‌కు సూచనలు సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే విల్లాస్ కార్యక్రమ అమలుకు 27 మంది ట్రైనర్స్‌కు శిక్షణ ఇచ్చామన్నారు. దెందులూరు మండలంలో 27 సెంటర్లు ఎంపిక చేశామని చెప్పారు.